# సంక్షేమ ప్రభుత్వాన్ని కాపాడుకోవాలి

- మహిళలే బీఆర్ఎస్‌కు బ్రాండ్ అంబాసిడర్లు
- ఎమ్మెల్యే దానం నాగేందర్
- మద్దతు తెలిపిన రామకృష్ణానగర్ బస్తీవాసులు



రామకృష్ణానగర్ బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్,అక్టోబర్ 19: ఖైరతాబాద్ నియోజకవర్గంలో మరోసారి బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురవేస్తేనే పేదలకు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందుతాయని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఖైరతాబాద్ డివిజన్‌కు చెందిన రామకృష్ణానగర్ బస్తీవాసులు గురువారం పెద్దసంఖ్యలో ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి తమ మద్దతు ప్రకటించారు. పొదుపు సంఘాల మహిళలకు వడ్డీలేని రుణాలు ఇవ్వడంతో పాటు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న బీఆర్ఎస్ పార్టీకే రానున్న ఎన్నికల్లో తాము ఓటు వేస్తామని వారంతా తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతుందన్నారు. ముఖ్యంగా మహిళల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం ఎన్నో కష్టాలు పడే తల్లిదండ్రులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఎంతో ఊరట కల్పించాయన్నారు. మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువస్తే పేద మహిళల కోసం సౌభాగ్యలక్ష్మి, రేషన్ షాపుల్లో సన్నబియ్యం, రూ.400కే గ్యాస్ సిలిండర్ లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయనున్నామన్నారు. మహిళల మద్దతు బీఆర్ఎస్ పార్టీకే ఉందని, మాయమాటలు చెబుతూ ఓట్ల కోసం వచ్చే ప్రతిపక్ష పార్టీల నాయకులు తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పేదల కోసం ఏమి చేశారో నిలదీయాలని సూచించారు. మహిళలే బీఆర్ఎస్ పార్టీకి బ్రాండ్ అంబాసిడర్లు అని, రానున్న ఎన్నికల్లో మహిళాశక్తిని చూపించి సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు.

# ప్రతిపక్షాల మాయ మాటలు నమ్మొద్దు



ఎంఏ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్



మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

హిమాయత్‌నగర్,అక్టోబర్19: స్వరాష్ట్రంలో తొమ్మిదిన్నర ఏండ్ల కాలంలో ప్రజల కష్ట,సుఖాల్లో అండగా ఉండి వారి అభివృద్ధి,సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. గురువారం హైదర్ గూడలోని ఎంఏ ఫంక్షన్ హాల్‌లో హిమాయత్‌నగర్ డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. దానం నాగేందర్ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ హిమాయత్‌నగర్ డివిజన్‌లో కోట్లాది రూపాయాలతో అనేక అభివృద్ధి పనులు చేయడం జరిగిందని తెలిపారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ 750 మందికి, పింఛన్లు 4000 మందికి, డబుల్ బెడ్ రూం ఇండ్లు 95 మందికి, దళిత బంధు 16 మందికి, బీసీ బంధు 205 మందికి,గృహలక్ష్మి కింద 260 మంది పథకాలతో లబ్ధిపొందారని గుర్తు చేశారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధితోనే ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడుగుతామని, ఎన్నికల సమయంలో వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే మాటలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇప్పించే బాధ్యత తీసుకుంటానని తెలిపారు. తాను గెలిచినప్పటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా తీర్చడం జరిగిందన్నారు. ప్రభుత్వ పథకాల నుంచి లబ్ధి పొందే ప్రజలు పొరపాటున ఎవరికీ డబ్బులు ఇవ్వొదని సూచించారు. 40 రోజుల పాటు ప్రతి కార్యకర్త పార్టీ కోసం కలిసికట్టుగా పనిచేసి ప్రభుత్వ పథకాలను గడపగడపకూ తీసుకువెళ్లాలని నవంబర్ 30న కారు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపిస్తే ఐదేండ్లు ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానని చెప్పారు. ప్రజల ఆశీర్వాదంతో ఖైరతాబాద్ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన మహిళలు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ హిమాయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు యాదగిరిసుతారి, నాయకులు యతిరాజు, రమేశ్‌యాదవ్,అశోక్ కుమార్, ప్రభాకర్‌గౌడ్,సర్ఫరాజ్, రాజేందర్‌కుమార్,కృష్ణయాదవ్,రాజేంద్రప్రసాద్‌ముదిరాజ్,గణేశ్,మాధవి,కళ,శ్రీకాంత్,యాస్మిన్,రూపేశ్ యాదవ్,రోహిత్ యాదవ్,నరేశ్, రాఘవేంద్ర, సుదర్శన్,యశ్వంత్,శ్రీనాథ్,అశ్విన్ పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన మహిళలు

## యువకుడి అదృశ్యం



శ్యామ్ నాగులు

బంజారాహిల్స్,అక్టోబర్ 19: అనుమానాస్పద స్థితిలో యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్ఐ సత్తయ్య గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ సమీపంలోని వెంకటగిరిలో నివాసం ఉంటున్న శ్యామ్‌నాగులు జూబ్లీహిల్స్‌లోని ఓ బంగ్లాలో తోటమాలిగా పనిచేస్తుంటాడు. మూడేళ్ల క్రితం అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న ముత్యాల లక్ష్మి అనే మహిళను వివాహం చేసుకున్నాడు. కాగా కొన్నిరోజులుగా భార్యాభర్తల మధ్యన తరచూ గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నెల 11న భార్య లక్ష్మితో తీవ్రంగా గొడవపడటంతో పాటు ఆమెను చితకబాదాడు. కోపానికి గురైన లక్ష్మి పుట్టింటికి వెళ్లింది. ఈనెల 15న భర్తకు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ రావడంతో ఆందోళనకు గురై నగరానికి తిరిగి వచ్చి చూడగా శ్యామ్ నాగులు కనిపించలేదు. దీంతో అన్ని ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో గురువారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## లలితాదేవి అలంకరణలో అమ్మవారు



శ్రీనగర్ కాలనీలో..

బంజారాహిల్స్,అక్టోబర్ 19: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజైన గురువారం పలు ఆలయాల్లో అమ్మవారిని శ్రీ లలితాదేవి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనగర్‌కాలనీలోని శ్రీ భ్రమరాంబ దేవి ఆలయంలో అ మ్మవారు శ్రీ లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఫిలింనగర్‌లోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయం, బంజారాహిల్స్ రోడ్ నెం 14లోని శ్రీ కనకదుర్గ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఫిలింనగర్ దైవసన్నిధానంలో అమ్మవారిని శ్రీ లలితాదేవి రూపంలో అలంకరించారు.

**పెద్దమ్మతల్లి ఆలయంలో..**

బంజారాహిల్స్,అక్టోబర్ 19: దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా జూబ్లీహిల్స్‌లోని శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో అమ్మవారు గురువారం శ్రీ లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ లలితాదేవి స్వరూపురాలైన పెద్దమ్మతల్లిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీ లలితా సహస్రనామ పారాయణం తదితర పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

## లలితా త్రిపురాసుందరిదేవిగా అమ్మవారు

ఖైరతాబాద్, అక్టోబర్ 19 : ఖైరతాబాద్ రాజ్‌నగర్‌లోని శ్రీ కనకదుర్గమ్మవారిని దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా 5వ రోజు గురువారం శ్రీ లలితా త్రిపురసుందరీ దేవిగా అలంకరించారు. అమ్మవారికి ఉదయం అబిషేకం, మహా చండీ హోమం నిర్వహిస్తామని, మహిళలతో సామూహిక కుంకుమార్చన, ప్రతి రోజు సాయంత్రం 7గంటలకు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

బంజారాహిల్స్.అక్టోబర్ 19: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం విశేష పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ, భగవతారాధన, సేవా కాలం తదితర పూజల అనంతరం స్వామివారు సూర్యప్రభ వాహనంపై మాఢ వీధుల్లో ఊరేగారు. పెద్దసంఖ్యలో భక్తులు సూర్యప్రభ వాహన సేవలో పాల్గొని తన్మయత్వం చెందారు. ఆలయ చైర్మన్ సీహెచ్.రామయ్య, ఈవో లావణ్యతో పాటు పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

## పని మనిషిపై లైంగిక దాడి.. కేసు నమోదు

బంజారాహిల్స్, అక్టోబర్ 19: పని మనిషిపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఆరోపణలతో జూబ్లీహిల్స్‌లోని ఒక ప్రసిద్ధి చెందిన స్కూల్ మాజీ చైర్మన్ మురళీ ముకుంద్‌తో పాటు అతడి కొడుకుపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన ప్రకారం.., బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని మిథిలానగర్‌లో ఉంటున్న మురళీ ముకుంద్ నివాసంలో జూన్ 18న ఓ యువతి(22) పని మనిషిగా చేరింది. జూలై 16న లంచ్‌కు వచ్చిన మురళీ ముకుంద్ తనను బెడ్‌రూమ్‌లోకి పంపించి తర్వాత వీడియోలు, ఫొటోలు తీశానంటూ తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధిత యువతి ఈ నెల 14న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయాన్ని మురళీ ముకుంద్ కొడుకు ఆకాశ్‌కు చెప్పగా తనను చితక బాదాడని ఫిర్యాదులో పేర్కొంది. యువతి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు బాధితురాలిని భరోసా కేంద్రానికి పంపించి ఆమె వాంగ్మూలం ఆధారంగా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఇది పేదల ప్రభుత్వం



తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సన్న బియ్యం పంపిణీ చేసేందుకు సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకం. వేల రూపాయలు పెట్టి బియ్యం కొనలేని పేదలకు ఎంతో ఉపయోగపడుతుంది. నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం ఆలోచించే గొప్ప నాయ కుడు సీఎం కేసీఆర్.పేదల ప్రభుత్వం అనేందుకు ఇదే నిదర్శనం.

–అనీశ్ గంగపుత్ర


**IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE : AT SANGAREDDY.**
**I.A.No. 1734 of 2019**
**IN**
**O.S.No. 320 of 2007**

**Between:**
Mohd. Samiuddin ...Petitioner/Plaintiff
AND
Smt. Shareefa Bee and others ...Respondents/Defendants.

To
Mangal Singh, S/o. Not known to the plaintiff, Aged about 65 years, Occ: Business, R/o. H.No: 8-2-310/C/13, Road No. 14, Banjara Hills, Hyderabad-34. (R-10)

**NOTICE**

Take notice that, the petitioner/ plaintiff has filed the above petition vide I.A.No. 1734/2019 in O.S.No. 320/2007 against the respondents/defendants and the same is stands posted to 03-11-2023 at 10:30 a.m., for your appearance before the Hon'ble Principal Junior Civil Judge at Sangareddy either in person or through an advocate. In default of your appearance on that day the matter will be decided on merits.

//BY ORDER OF THE COURT//
Sd/- **P. BAPU REDDY**
Advocate, Sangareddy.